రేత్తిరి మూర్తం. పెళ్ళి పందిరి కిటకిట లాడిపోనాది. ఆ పెళ్ళికి మాఊరు తొలిసారి గ్యాస్ లైట్లు తెప్పిస్తా.

ఇక పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ అంతావా. నల్లమందు అలవాటైందేమో పీటమీద కూసున్న నాయుడు పీటమీదే తూలు తున్నాడు. సిన్నప్పుడు తిరిగిన తిరుగుళ్ళకి మనిషి ఊరిపోయి ఉబ్బిన శవం లాగున్నాడు.

ఇక పెళ్ళికూతురంటావా? వయసులోనే నాయుడు పెద్దా ఆమె సిన్నా. మనిషి మాత్తరం అతనంతా ఉంది. ముక్కు నోరంతా ఉంది ఎడల్పు. పట్టుకోకా, జరీ రవికా తొడుక్కొని ఇంతింత జెబ్బలతో నల్లగా ఇలా గెలాగుందంటె ... మన ఊరవతల అమ్మోరు పట్టుకోక కట్టుకొని నడిచొచ్చేసి పీటమీద కూకుంటే ఎలాగుంటుంది – అదిగలాగుంది. ఆయమ్మ పీటమీద కూకుంటే కడుపు బేమ్మడి ఒళ్ళో ఉంది. మొగోడికి ఆడ ఏసం ఏసినా ఆయమ్మ కంటే బాగుంటాడు.

ఇలాగ తిన్న పెళ్ళి బూర్లు అరిగేయో లేదో అలా ఆ మూడో పెళ్ళానికి కడుపన్నారు రెండోనెల్నే గాజు నెట్టించేసినారు మాకిదే ఆచారం అంటూ. పెళ్ళయిన మూడ్నెల్లకి పురిటి కొచ్చెసినట్లయి పోనాది ఆ మనిషి. ఈ ప్రతాపమంతా తనదే అయినట్లు నాయుడు తంగివోడు అడిగనోడిదే పాపం. అందరికిసెప్పేవోడు తన పెళ్ళానికి కడుపని.... బాబురే వొరసం తగ్గినట్టుంది సూడు – లేవడానికి నాకు కీళ్ళు పట్టేసినాయి అని ఆగేడు బీడీ అంటిస్తూ...

"కద కానీ తర్వాత చూద్దాం" అన్నాడొకడు.

కదదేటుందిరా అయిపోనాది. మరోనెల పోనాక ఆయమ్మ కడుపు పోనాది, ఏతాం కాడ, ఉన్న నాయుడు ఈ మాటినగానే కళ్ళు తిరిగి ఇరగబడిపోయి నూతిలో పడి సచ్చేసినాడు. ఏ బరంపురం నుంచో వోరసుణ్నంటూ ఎవరో వచ్చి ముగ్గురు ముండలకీ మనోవర్తి పారేసి, అదిగో నాను సెప్పేనా వొరసం పోనాదని, లారీలు స్టార్టయి పోనాయి. నెగండి మనోవర్తి మూడ్డబ్బులు మరీసి ఆస్తంతా పట్టుకుపోయేడు అంటూ లేచి పోయేడు అతను.

**(1975)**

# పెన్సిలిన్ ఐపోయింది

అలా తనెంత సేపు ఆ వరండాలో కూర్చునుందో ఆ ముసలమ్మకి తెలిదు కాని సుమారు ఓ గంట గడిచేక హాస్పిటల్ తలుపులు తెరుచుకున్నాయి. తను మొక్కిన దేవుడు స్వయంగా వచ్చి తన కోసమే గుడితలుపులు తెరచి నట్టనిపించిందామెకి, ఆలస్యం చేస్తే తన దేవుడు మాయమైపోతాడేమోనన్న ఆతృతతో భుజం మీదున్న పిల్ల బరువుకి తూలుతూ ఆమె లోపలికి వెళ్ళింది.

అప్పటికే కుర్చీలో కూర్చొని తలొంచుకొని ఏదో రాసుకుంటున్న డాక్టరు రాజ్యేశ్వరరావు తలెత్తకుండానే అడిగేడు.

"పేరు?"

ముసల్ది మాట్లాడలేదు. పసిదానికి పేరులేదు.

జవాబు రాకపోవడంతో తలెత్తి చూసేడు డాక్టరు. ఎదురుగా నిల్చున్న ముసలమ్మ పుట్టగానే చచ్చిపోయి ఎదిగి, ముసలై పోయిన శవంలా వుంది. చచ్చిపోయిన పాదు చివర్న వెలాడుతున్న యెండు కాయలా ఆమెభుజాన వేలాడుతోంది ఓ పిల్ల. ఆ పిల్లకి నాలుగేళ్ళ వయసూ, నాల్రోజులజ్వరమూ ఉన్నాయి. ముందు ముందు తను పడవలసిన బాధలన్నీ ఎదురుగా కన్పిస్తున్నట్టు, వాటిని చూడలేక భయపడి పోయినట్లు, ఆ పిల్ల కళ్ళు బెదురుతున్నాయి. జబ్బు ముసలిదానికా, పిల్లకా అన్నట్టు ఆశ్చర్యపోయే డతను. ఇద్దరూ "కంపుజబ్బు" చేసినట్టు దుర్వాసన కొడుతున్నారు.

"ఏవిటి సుస్తీ"?

"నాల్రోజులై ఒళ్ళు కాలిపోతున్నాది. పడవలా పడిపోనాది పిల్ల."

స్టెత్ తీసుకొని లేచాడతను. "ఏమౌతుంది నీకీపిల్ల?" అని పరామర్శిస్తూ..

పరీక్ష పాసై పదినెల్లూ, ఈ తాలూకా హాస్పిటల్లో చేరి ఆరు నెలలే అయినప్పటికీ తన మీదున్న ముగ్గురు పెద్ద డాక్టర్లకంటే తానే పాప్యులర్ అయిపోవాలని అతని ఆశ.

"కూతురు... మిగిల్చిపోనాది".

ఆ పిల్ల చనిపోయిన ఆమె కూతురు మిగిల్చిపోయిన మచ్చ. ఆమె కలల పంట.

పరీక్ష చేస్తున్న అతనికి ఆ పిల్ల ఊపిరి పడగాలిలా తగిలింది. జ్వరం చాలా వుంది. దగ్గటానికి ఓపికలేని ఆ పిల్ల చిన్నగా బెక్కుతోంది. చూడగానే అర్థమైపోయిందతనికి అది న్యుమోనియా అని.

వెంటనే ప్రిస్క్రిప్షన్ రాయబోయి ఏదో డైలమాలో పడిన వాడిలా ఆగిపోయేడు.

చాలా మంది డాక్టర్లు చాలాసార్లు డైలమాలో పడతారు. ఫలానా వాడికి ఎంటెరిక్ ఫీవరా? వైరల్ ఫీవరా? ఆరో నెంబరు బెడ్డుకి గేస్ట్రిక్ అల్సరా? స్టమక్ కేన్సరా? అని జబ్బుల విషయంలో పడవచ్చును. మూడో నెంబరు ముసలతని కడుపునొప్పి మందుల్తో తగ్గుతుందా? సర్జరీ చేసియాలా? పదోనంబరు పంచ కళ్యాణి పైన్ఫుల్ పీరియడ్సికి "ఈస్ట్రోజన్స్" ఇవ్వాలా? యుటిరస్ పీకెయ్యాలా? అని వైద్యం విషయంలో పడవచ్చును. మందులు కొనుక్కోలేని ముష్టి పేషెంటకి శాంపులిచ్చి పుణ్యం కట్టుకోవడవా? వాటిని షాపులకి తోలేసి వాళ్ళని కర్మ వదిలేసి పాపం పోసుకోవడవా? అని పాపపుణ్యాల విషయంలో పడవచ్చును. అదే యే కుర్రడాక్టరో అయితే తనతో తిరిగిన పిల్లకి పూలదండ వేయాలా? అమ్మా నాన్నా కుదిర్చిన అమ్మాయికి పసుపుతాడు కట్టాలా? అని ప్రేమ డైలమాలో పడవచ్చును. తన కూతుర్ని మెడిసిన్ చదివించాలా, మేనరికం చేసేయాలా? మరో పెద్ద డాక్టరు పిల్ల డైలమాలో పడవచ్చును. డాక్టర్లు కూడా మనుషులే కాబట్టి, ఆదర్శంగా బ్రతకాలా, ఐశ్వర్యంతో బ్రతకాలా? మంచిగానా, చెడ్డగానా? అని బ్రతుకుడైలమాలో పడవచ్చును.

ఐదేళ్ళ క్రిందట-డాక్టర్ జగన్నాథం సరిగ్గా ఇదే డైలమాలో పడ్డాడు. అప్పుడతను వరండాలోని తన పాత పడక్కుర్చీలో పడుకొని పక్కనే వున్న వ్యక్తిని పట్టించు కోకుండా పై కప్పువంక చూస్తున్నాడు ఆ ప్రక్క వ్యక్తి ముక్కుమూస్తే ముప్ఫై యేళ్ళుంటాయనిపిస్తుంది జుత్తు చూస్తే యనభైపైనే ననిపిస్తుంది. కళ్లు చూస్తే ఇరవైలోపు, మీసం చూస్తే పదహారు పైనేనని అనిపిస్తుంది. కాని ఆమె వయసు నలభై. ఆమె జగన్నాథం భార్య యశోద. ఈ యశోదకి కన్న కొడుకులుగాని, పెంపుడుకొడుకులుగాని లేరు. కాని ఇద్దరు కూతుళ్లూ, వారికి ఇంకా పెళ్ళికాలేదే అన్న బెంగ. యిటుపై అవుతుందన్న అవదోనన్న భయమూ ఉన్నా యావిడకి. అంతకు ఐదునిముషాలక్రితమే తన బెంగా, భయమూ అతనితో మొరపెట్టుకొంది.

ఆనాటివరకూ అతని కెలాంటి బెంగా, భయమూలేవు, హాస్పిటలే అతని ప్రపంచం. డ్యూటీయే అతని వ్యసనం. ఫస్టు తారీఖున జీతం తీసుకొచ్చి భార్యచేతులోపోయడం మినహా అతనికి సంసారంతో ఏమాత్రం సంబంధమూ లేదు, వేళకి అన్నం పెడితే తినడమేగాని, పెట్టకపోతే ఎందుకు పెట్టలేదని కూడా అడిగెరగడు. అతనికెప్పుడూ ఏ విషయమూ పట్టేదికాదు. "ఏవిట్రాయిదని" ఎవరన్నా దగ్గరవాళ్ళడిగితే ఏదెలా జరగాలో అలా జరుగుతుంది, మనం పట్టుకుంటే ఆగుతుందా! వదిలేస్తే మానేస్తుందా? మనపని మనం చేసుకుంటే సరి" అంటూ ఒక వెర్రి వేదాంతపు నవ్వు నవ్వేవాడు.

ఆ నవ్వు అతనికి చిన్ననాటి నుంచీ ఉంది, అరమార్కు అర్థించకుండా, అతి చిన్న రికమండేషనైనా లేకుండా ఒకటో తరగతినుండి యం.యస్. జనరల్ సర్జరీ వరకూ మంచి మార్కుల్తోనే పాసయ్యేడతను. తను అందగాడే అయినప్పటికి అప్సరస భార్య కావాలని కోరుకోలేదు. అక్షరజ్ఞానంలేని తన తల్లిదండ్రులు ఐదో క్లాసు పాసైన యశోదని కుదిర్చినప్పుడు సంతోషంగా పెళ్ళిచేసుకున్నాడు.

అతనికి సంపాదనమీద కూడా అట్టే ధ్యాసలేదు అంచేత, సర్వీసులో చేరి పదిహేనేళ్ళయినా సివిల్ సర్జనై ఐదేళ్ళ యినా పాతకారు కాదుకదా, చివరికి పదిరూపాయల బేంకెక్కొంటు కూడా లేదు.

అలాగని అతని కోరికా లేదనుకోవడం పొరపాటు అతనికున్న ఒక్క కోరికా తను మనిషిగా, డాక్టరుగా పది మంది చేత మంచి వాడనిపించుకోవాలని. అతని కోరికకి అతని భార్య ఏనాడూ అడ్డురాలేదు. అతను రోజులో ఇరవై గంటలు హాస్పిటల్లో గడిపినా కనీసం మిగిలిన నాల్గు గంటలైనా తనతో గడపమని ఆవిడేనాడూ అడిగెరుగదు. పెళ్ళినాడు పుట్టింటివారు పెట్టిన పట్టుచీర తప్ప మళ్ళీ పట్టుచీరనీ, పందిరిమంచాలనీ కోరలేదు. అర్ధజీతం అత్తారికి పంపించేసినా అదేమని అడ్డుచెప్పలేదు. ఆవిడకున్న ఒక్క కోరికా మెడిసిన్ చదువుతున్న తన కూతుళ్ళిద్దరికీ కాస్త మంచి సంబంధాలు చూసి పెందలాడే పెళ్ళిళ్ళు చేసేయాలని. ఆ కోరిక నెరవేరాలంటే జగన్నాధాన్ని బాధపెట్టక తప్పదు.

తన పిల్లల పెళ్ళి బాధ్యత పూర్తిగా తనదేనని అతని కామె చెప్పేవరకూ తట్టలేదు. తట్టినతరువాత కూడా అతను పెద్దగా

బాధపడలేదు. కళ్యాణ ఘడియ రావాలేగాని పెళ్ళెంతసేపు అనుకున్నాడు. కాని, తానొకటితలిస్తే కాబోయే అల్లుడు మరొకటి తలుస్తాడు.

"అసల్నాకు రెండు లక్షలిస్తామని వచ్చారు. మీ అమ్మాయి కూడా డాక్టరే కాబట్టి మా వాళ్ళని లక్షకి వప్పిస్తాను. మా ఇద్దరి చదువు అయిపోయింది. కాబట్టి మమ్మల్ని ముందు కౌలాలంపూరు, తరువాత అమెరికా పంపించేయండి. అక్కడే సెటిలైపోతాం. ఆఫ్‌కోర్స్, మీరూ అక్కడికే వచ్చేయొచ్చు రిటైరయ్యాక" అన్నాడు పెద్దమ్మాయిని ప్రేమించిన ఓ రిచ్ డాక్టర్.

"మేవూలక్షకే వచ్చే వాళ్ళం. కాని మీ అమ్మాయింకా ఫోర్తియిరేకదా! చదువు పూర్తయ్యే దెప్పుడు ఆర్జించే దెప్పుడూ? మరంచేత ఒకటిన్నరయితే మాకే అభ్యంతరమూ ఉండదన్నాడు. ఓ పి.హెచ్.డీనికన్న తండ్రి. ఆ కుర్రాడికి ఆరెకరాల పొలమూ, ఆరుమైళ్ళు జుట్టూతప్ప యింకేమిలేవు.

అప్పటి వరకూ బుద్ధావతారంలాంటి జగన్నాథం యివన్నీ విన్నమీదట నరసింహావతారం ఎత్తేసి పెళ్ళివారి పేగులు పీకేసి తన పిల్లల మెళ్ళో వేసేస్తానన్నాడు. అతని వాలకం చూసిన యశోద ముందు భయపడింది. ఆ తరువాత బతిమాలింది. పేగులు పీకినంత మాత్రాన పెళ్ళిళ్ళు కావంది. దానిక్కావసింది ఓర్పు, డబ్బూగాని కోపమూ, పేగులూ కావంది. కాబట్టి డబ్బు సంపాదించే మార్గం చూడమంది. ఆనాటి నుండి అతను ఆలోచన్లో పడ్డాడు.

మళ్ళీ ఈ రోజు యశోద పిల్లల పెళ్ళి విషయం ఎత్తడంతో అతను డైలమాలో పడ్డాడు. మంచిగా బ్రతికి మసైపోవాలా? చెడ్డగానైనాసరే డబ్బార్జించాలా అన్న అతని డైలమాని యశోద కళ్ళల్లో తిరిగిన కన్నీరు "ఎలాగైనా సరే డబ్బే ఆర్జించాలి" అన్న నిర్ణయంగా మార్చింది. అంతే....

ఆ రోజు నుండి హాస్పిటల్ క్లబ్బయింది, డబ్బే అతని ప్రపంచమయింది.

ఎవరైనా సరే డబ్బార్జించాలన్న నిర్ణయం తీసుకోవాలేగాని మరిక వాళ్ళకి మంచి-చెడ్డా, గొప్పా-బీదా. నీతి-నిజాయితీ, పాపం-పుణ్యం, ఉచ్ఛం-నీచం, అనే విచక్షనుండదు. జగన్నాథునిక్కూడా ఇప్పుడే విచక్షణాలేదు.

అతను పేషంట్లకి బ్రెడ్‌లమ్మేడు, బల్లెక్కించి బేరాలాడేడు. తోటీలకీ, ఆయాలకి పోస్టింగులమ్మేడు. దొంగ సర్టిఫికెట్ల మ్మేడు. మర్డరు కేసుల్లో సాక్ష్యాలమ్మేడు. ఒకటేవిటి? పెళ్ళాం, పిల్లలూ మినహా అమ్మతగ్గవన్నీ అమ్మేడు. డబ్బు సంపాదించటానికి వంద మార్గాలుంటే అతనే ఒక మార్గాన్నీ వదల్లేదు.

దానితో...

అయిదేళ్ళు తిరిగేలోపల అద్దెకొంపని ఐదంతస్తుల మేడ చేసేసేడు. దాని పోర్టికోలో యింపోర్టెడ్ కారుని దించేసేడు. బేంకులో అయిదు లక్షలు కూడబెట్టేశాడు.

ఇప్పుడతని పెద్ద కూతురు అమెరికాలో ఉంది.

చిన్న కూతురు స్విడ్జర్లాండులో ఉంది.

యశోద ఎప్పటిలాగే వున్నా ఆమె కొకప్పుడున్న ఒక్క దిగులూ యిప్పుడులేదు.

జగన్నాథమిప్పుడు డైలమాలోపడే స్థితినుండి డి.యం.ఓ. గా ఎందర్నో డైలమాలో పెట్టే స్థితికి చేరుకున్నాడు.

ప్రిస్క్రిప్షన్ రాస్తూ ఆగిపోయిన డాక్టర్ రాజేశ్వరరావుకి ఆలోచనలు ఆగలేదు. ఆ జబ్బుక్కావలసిన మందు ఆ హాస్పిటల్లోలేదు. బయటుందిగాని ఈ ముసలమ్మకి కొనుక్కొనే శక్తిలేదు. ఉన్నమందే ఇస్తే ఆ జబ్బు తగ్గుతుందో, తగ్గదో? తగ్గకపోతే ఆ పిల్ల బ్రతుకుతుందో లేదో ఆ పసిది కూడా చనిపోతే ఆ ముసల్ది చచ్చి శపిస్తుందో? ఏవో? కానీ చేసేదేవుంది ఉన్నమందు రాసిచ్చేయడంతప్ప!

ఆలోచనలు ఆపిన రాజేశ్వరరావు కాగితం మీద 'సల్ఫా' బిళ్ళలో మరే 'ఉల్ఫా' బిళ్ళ రాసిస్తూ భగవంతుడికి క్షమాపణ చెప్పుకుంటున్నట్టుగా సన్నగాగొణుక్కున్నాడు.

"పెన్సిలిన్ ఐపోయింది".

మందురాసి ముసలమ్మని పంపించేసినా అతని మనసు చికాగ్గానే ఉంది. అసలీ హాస్పటల్లో అవసరానికే మందూ ఉండదేం? ఎప్పుడన్నా ఏదో ఒకటి ఐపోవడం న్యాయవే కాని ఎప్పుడూ ఏదో ఒహమందైపోవడవేఁ! ఎక్కడుందీ మిస్టరీ అనిపించింది ఎంత ఆలోచించినా అర్థం కాలేదతనకి అంచేత ఆ సాయంకాలం అందరూ హాస్పిటల్ గార్డెన్‌లో కూర్చునుండగా అదే మాటడిగేడు కో-డాక్టరు మూర్తిని. అడిగిన తరువాత బాధపడ్డాడు - ఎందుకడిగేనా అని. అక్కడ కూర్చున్న వాళ్ళలో మెడికల్ ఆఫీసర్ మాధవరావు కూడా ఉన్నాడు.

"ఇందులో రావూగారి మహిమేమీ లేదు. అంతా జగన్నాథ మహిమే" అంటూ నవ్వేడు. టి.బి. స్పెషలిస్ట్ డాక్టర్ రెడ్డి.

"అంటే" అమాయకంగా మొహం పెట్టేడతను.

రావుగారిని రక్షించడానికా అన్నట్టుగా రెడ్డిగారే మళ్ళీ అందుకున్నారు.

"చెప్తానుండండి! అన్ని హాస్పిటల్స్‌కి మందు లెక్కడ నుండొ స్తాయి? గవర్నమెంటునుంచే! గవర్నమెంట్‌లీ చిల్లర దుకాణం పెట్టుకూర్చోలేదు. ఏరోజు మందులారోజు మన కమ్మడానికి. అంచేత ప్రతి హాస్పిటల్‌కి వాళ్ళ డిమాండ్‌ని బట్టి, వీళ్ళ వీలుని బట్టి పెన్సిలిన్ కొంటారో పిప్పరమెంట్లే కొంటారో? కొనుక్కోండని ఎంతో కొంత డబ్బు మొహాన పడేస్తుంది. అంతే. అక్కడితో వాళ్ళ బాధ్యతతీరిపోతుంది. గవర్నమెంటు డబ్బులిచ్చి కంపెనీలు మందులిస్తే మరికొరతేమిటని మీడౌటు! అదే జగన్నాథం మహిమ, ఎలా గంటారా? మాటవరసకి పెన్సిలిన్ తీసుకుందాం. పన్‌డోస్ వయిల్ ఖరీదెంత? మీకు తెలీదా? నాకూ సరిగా తెలీదు. ఈ రోజు ధరెంతో సుళువుకోసం రూపాయనుకుందాం. ఫైవ్‌డోస్ వయలెంత? ఐదు రూపాయలా? కాదు మూడు రూపాయలే! మన జిల్లాకి నెలకి పన్నెండు వేలు శాంక్షనైందనుకుందాం ఆ డబ్బుతో వన్‌డోస్ వయల్సు కొంటే పన్నెండు వేలు ఫైవ్‌డోస్ వయల్సేకొంటె ఇరవై వేల డోసులు వస్తాయి. మొదటిది కొంటె కంపెనీ వాడికి లాభం. రెండోది కొంటే పేషెంట్స్‌కి లాభం. ఎందుచేత నంటే కంపెనీవాడు కొట్టేసే కమిషను సీసాలెక్క నుంటుంది గాని డోసుల్లెక్కనుండదు. కంపెనీ వాళ్ళకి కావలసింది తమ లాభంకాని పేషెంట్ల లాభంకాదు. మనపై ఆఫీసర్లక్కూడా పేషెంట్ల శ్రేయస్సు కంటే కంపెనీల శ్రేయస్సే ముఖ్యమైనప్పుడు మనకు మందులైపోతూనే వుంటాయి. మరింక నాచేత వివరాలు చెప్పించకండి" అన్నాడు అక్కణ్ణుంచి లేచిపోతూ.

కుర్ర డాక్టరింకా అసలు విషయం అందలేదన్న సంగతి గ్రహించిన మాధవరావు వివరాలు కూడా చెప్పేశాడు. "మన గురువులు కంపెనీవాళ్ళ దగ్గర కక్కుర్తి పడతారన్నమాట".

**(1973)**

# ఇది కథ కాదు

శ్రీనివాసరావు సిటీబస్ దిగేడు.

సుశీల కూడా అదే బస్సు దిగింది.

శ్రీనివాసరావు బాపూ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్ళాలి.

సుశీల బాపూ రోడ్డువేపుకే తిరిగింది.

శ్రీనివాసరావు ఒళ్ళు జలదరించింది. రెప్ప వెయ్యటం మర్చిపోయాయి అతని కళ్ళు. అడుగు వెయ్యడం మర్చిపోయాయి అతని కాళ్ళు. అతనికి ఆమెని తెలీదు. అయినా తన కాబోయే ప్రేయసిని అతను వెనుకనుంచైనా పోల్చుకోగలడు. అతనికి పాతికేళ్ళు.

అతని ప్రకారం ఆమెకి యిరవై దాటడానికి వీల్లేదు. అంచేత ఆవిడకి యిరవైయ్యే.

ఆమె అతనికంటే పాతిక గజాలు ముందు నడుస్తోంది. ఆమె కట్టుకున్న తెల్ల సిల్కు చీర ఆమెని పొగమంచులా కమ్ముకుంది. దాని జరీ అంచు బంగారు పాముపొరలా ఆమెని నిలువునా చుట్టుకుంది. ఆమె జోళ్ళ ఎర్ర పట్టీలు పాదాల రంగులో కలిసిపోయేయి.

శ్రీనివాసరావు గుండెలు కడుపులో కలిసిపోయేయి. జోరు జాస్తి చేసి సుశీలను దాటిన అతను ఆగి వెనక్కి తిరిగేడు.

అన్ని వేగాల్లోనూ మనోవేగం ఎక్కువంటారు. కాని మనోవేగం కంటే ఎక్కువ ప్రేమవేగం అంటాడు శ్రీనివాసరావు. అంచేత ఆ పాతిక గజాలు దాటడానికి అతనికి పది లిప్తలు పట్టలేదు.

ఆమె ముక్కు మూరెడుంది.

కళ్ళు చారెడున్నాయి.

మూతి ముప్పావించి ఉంది.

అంత నల్లటి జుత్తు లేకపోయినా ఆమె మొహం బాగా తెల్లగానే కనిపించేంది.

"నల్ల ముత్యాలు కూడా వుంటాయి కాబోలు" అనుకుంటారు. ఆమె తెల్లని మెడలో ముత్యాల గొలుసుని చూసిన ఎవరైనా.

శ్రీనివాసరావు నవ్వేడు. అతని పళ్ళు కట్టుడు పళ్ళలా అందంగా వున్నాయి.